సాక్షి మంచిర్యాల

7

సోమవారం ౹ 9 ౹ సెప్టెంబర్ ౹ 2024

గరిష్టం/కనిష్టం
28.5 /25.3

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. వాయుగుండం ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

కొలువుదీరిన ఆది దేవుడు


చెన్నూర్‌లో గిల్డా పరివార్ ఆధ్వర్యంలో పూజలు


మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయంలో గణనాథుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు


హరిఓం గణేశ్ మండలి వినాయకునికి పూజలు


జైపూర్ ఎస్టీపీపీలో అధికారుల పూజలు


చెన్నూర్‌లో మారుతి గణేశ్ మండపం వద్ద వినోద్.

మంచిర్యాలటౌన్: జిల్లాలో వినాయక నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా ఊరూరా.. వాడవాడలా గణేశ్ మండపాల్లో ఆదిదేవుడిని ప్రతిష్టించి పూజలు చేశారు. ఇళ్లల్లో కూడా మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పూజలు చేశారు. పాతమంచిర్యాల సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలను నిర్వహించారు. విశ్వనాథ ఆలయంలో ప్రతిష్టించిన శ్రీసిద్ధి వినాయకస్వామిని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆయన భార్య నడిపెల్లి రాజకుమారి దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మంచిర్యాల బస్టాండు ఎదురుగా హరిఓం గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.


నస్పూర్‌లో కొలువుదీరిన లంబోదరుడు

న్యూస్‌రీల్

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే


మహేశ్ కుమార్‌గౌడ్‌తో ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితుడైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు శనివారం కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ చీఫ్‌కు మిఠాయిలు తినిపించారు.

అశోక్ యాదవ్.


పీసీసీ అధ్యక్షుడితో అశోక్ యాదవ్

భీమారం: గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. మహేశ్ గౌడ్‌ను అధిష్టానం అధ్యక్షుడిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు.

నేడు అప్రెంటిస్‌షిప్ మేళా

మంచిర్యాలటౌన్: ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వై.రమేశ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేటు లిమిటెడ్‌లో 100 సీట్ల చొప్పున ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సోలార్ టెక్నీషియన్ (ఎలక్ట్రికల్), ఎలక్ట్రానిక్స్ మెకానిక్‌లో 30 ఖాళీలు ఉన్నాయని వివరించారు. రూ.13,500ల అటెండన్స్ అలవెన్సు, మెడికల్ ఇన్సూరెన్స్, క్యాంటీన్, ఓవర్‌టైం సౌకర్యం ఉందని తెలిపారు. రెనె ఇంజిన్ వాల్వ్ ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాద్‌లో ఫిట్టర్ ఖాళీలు 30 ఉండగా, రూ.12 వేల స్టైఫండ్ ఉంటుందని, ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్‌లో 150 ఖాళీలు ఉండగా రూ. 12,400 అటెండెన్స్ బోనస్, ఉచిత రవాణా, ఉచిత క్యాంటీన్ సదుపాయం ఉందని తెలిపారు. ఆదర్శ ఆటో మొబైల్స్ ప్రైవేటు లిమిటెడ్, కరీంనగర్ మెకానిక్ డీజిల్‌లో 15 సీట్లు, మెకానిక్ మోటార్ వెహికిల్ 10 సీట్లు, ఎలక్ట్రీషియన్ 5 సీట్లు ఉండగా, రూ.10 వేల చొప్పున స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. శక్తి హార్మోనీస్ హైదరాబాద్ ఎలక్ట్రీషియన్, ఫీనెస్టా హైదరాబాద్, ఎస్ఆర్‌బీ బేరింగ్స్ హైదరాబాద్‌లో ఫిట్టర్, వెల్డర్, మెకానిక్ డీజిల్ 130 సీట్లు ఉండగా, రూ.12 వేల స్టైఫండ్ తోపాటు, ఉచిత రవాణా, ఉచిత క్యాంటీన్ సదుపాయం ఉందని తెలిపారు. వీఈ వెహికల్స్ (వోల్వో) ఇందారంలో మెకానిక్ డీజిల్ 3, ఎలక్ట్రీషియన్ 2 ఖాళీలు ఉండగా, రూ.10 వేల స్టైఫండ్ ఇస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు రెజ్యూమ్, అప్రెంటిస్‌షిప్ రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్సెస్సీ మెమో, ఐటీఐ మెమోతోపాటు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ కాపీ, రెండు ఫొటోలతో రావాలని సూచించారు.

నష్టంపై నివేదిక ఇవ్వాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వర్షాల కారణంగా ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన నష్టాలపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గూగుల్ మీట్ ద్వారా ఆర్డీవోలు, రోడ్లు భవనాలు, ఇరిగేషన్, జిల్లా పంచాయతీ శాఖల అధికారులు, జెడ్పీ సీఈవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 5 వరకు జరిగిన నష్టాలను నిర్ణీత ప్రొఫార్మాలో తయారు చేయాలని ఆదేశించారు.

మళ్లీ గన్ కల్చర్!


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

- అక్రమంగా వినియోగిస్తున్న ముగ్గురి అరెస్ట్
- రెండు తుపాకులు, రెండు కత్తులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్


స్వాధీనం చేసుకున్న రివాల్వర్లు, కత్తులు, బుల్లెట్లు

మంచిర్యాలక్రైం: జిల్లాలో గన్ కల్చర్ పెరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా తుపాకులు వాడుతున్నారు. తరచూ తుపాకులతో నిందితులు పట్టుబడడం కలకలం రేపుతోంది. గతేడాది ఏప్రిల్ 5న హమాలీవాడలో ఓ ఇంట్లో గన్, మావోయిస్టుల కరపత్రాలు లభించాయి. అవి ఐఎఫ్‌టీయూ ఆర్గనైజేషన్‌లో పనిచేసే ఓ నాయకుడిదన్న చర్చ జరిగింది. అయితే పోలీసులు అది బొమ్మ తుపాకని కొట్టిపారేశారు. తాజాగా జిల్లా కేంద్రంలోని ఏసీసీలో తుపాకులు పట్టుపడ్డాయి. ఓ యువకుడు వివాహేతర సంబంధం పెట్టుకున్న యువకుడు సదరు మహిళ వద్దకు వెళ్లి తుపాకీతో అడ్డంగా దొరికిపోయాడు. అతను ఇచ్చిన సమాచారంతో మంచిర్యాల పోలీసులు తుపాకులు వినియోగిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రెండు తుపాకులు, రెండు కత్తులు మూడు బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలు స్థానిక డీసీపీ కార్యాలయంలో డీసీపీ భాస్కర్ శనివారం వెల్లడించారు.

ఏం జరిగిందంటే..

జిల్లాలోని నెన్నెల మండలం ఆవడంకు చెందిన మగ్గిడి జితేందర్–స్వాతి దంపతులు. ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. దీంతో మూడు నెలలుగా స్వాతి ఏసీసీలోని పుట్టింట్లో ఉంటోంది. ఈనెల 5న రాత్రి జితేందర్ తన భార్య స్వాతిని కలవడానికి రాగా స్వాతితో కలిసి ఇంట్లో నెన్నెల మండలం ఆవడంకు చెందిన రాంటెంకి అన్వేశ్(కారు డ్రైవర్) తన అత్తగారి ఇంట్లో ఉన్నారు. దీంతో తన భార్యతో వివాహేతన సంబంధం పెట్టుకున్నాడని అనుమానించిన జితేందర్ అన్వేశ్‌ను అడ్డుకుని ఎందుకు వచ్చావని నిలదీశాడు. కోపోద్రిక్తుడైన అన్వేశ్ జగదీశ్‌పై దాడిచేసి తన వద్ద ఉన్న రివాల్వర్ చూపిస్తూ ఎప్పటికైనా నిన్ను చంపుతానని బెదిరించాడు. జగదీశ్ కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడికి చేరుకునేలోపు అన్వేశ్ పారిపోయాడు.

అభినందించిన సీపీ..

బాధితుని ఫిర్యాదు మేరకు చాకచక్యంగా వ్యవహరించి ఫిర్యాదు అందిన 24 గంటల్లో నిందితులను పట్టుకున్న ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సీలాల్, సిబ్బందిని రామగుండం సీపీ శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్ అభినందించారు.

పోలీసులకు ఫిర్యాదు..

అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయి జగదీశ్.. గ్రామానికి చెందిన అన్వేశ్ వద్ద తుపాకీ ఉందని, ఎప్పటికైనా తనను చంపుతానని బెదిరించాడని ఈనెల 6న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక టీమ్‌లతో గాలింపు చేపట్టాయి. నెల 7న సాయంత్రం 4 గంటలకు హైదరా బాద్ పారిపోయేందుకు అన్వేశ్ మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీ సులు మాటువేసి పట్టుకున్నారు. అతనితోపాటు నెన్నెల మండలం ఆవడంకు చెందిన దుర్గం భానుప్రసాద్(సెంట్రింగ్ వర్క్), సీసీసీ నస్పూర్ మండలం శ్యామ్‌నగర్‌కు చెందిన మంతెన అశోక్ (కారు డ్రైవర్)ను కూడా అరెస్టు చేశారు. వారి నుంచి రెండు తుపాకులు,(కంట్రీమేడ్ రివాల్వర్, ఎయిర్ పిస్తోల్) రెండు చాకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

తుపాకులు ఎక్కడివి...?

రాంటెంకి అన్వేశ్, మంతెన అశోక్ కారు డ్రైవర్లు. ఇద్దరూ స్నేహితులు. అశోక్ బావ చెన్నూర్ మండలం సోమనపెల్లి గ్రామానికి చెందిన తోకల తిరుపతి పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ, న్యూడెమోక్రసీ, సింగరేణి అనుబంధ సంస్థ ఆర్గనైజేషన్‌లో పనిచేసేవాడు, తిరుపతి యూనియన్ కార్యకలాపాల్లో భాగంగా అవసరం ఉన్నప్పుడు తన వద్ద ఉన్న కంట్రీమేడ్ రివాల్వర్(ఓల్డ్ మోడల్) వినియోగించేవాడు. తనపని పూర్తవ్వగానే రివాల్వర్‌ను అశోక్ ఇంటి వద్ద దాచేవాడు. ఇలా 15 ఏళ్లుగా గన్ అశోక్, తిరుపతి వద్ద ఉంటోంది. తిరుపతి ఎనిమిది నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో రివాల్వర్ అశోక్ వద్దనే ఉండి పోయింది. అశోక్ దీనిని గొడవల సమయంలో, ఒంటరిగా ఎక్కడికైనా సెటిల్‌మెంట్లు, బెదిరించడానికి వెళ్లినప్పుడు వెంట తీసుకెళ్లేవాడు. ఇదిలా ఉంటే.. పట్టుబడిన మరో నిందితుడు భానుప్రసాద్, అన్వేశ్ ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు. అశోక్ వీరి స్నేహితుడు. వీరితో పాటు నెన్నెల మండలానికి చెందిన మరో ఇద్దరు కామెర మధు, దూగుట దిలీప్ ఒక ముఠాగా ఏర్పడి అమాయకులను బెదిరించడం, బంగారు పూతతో ఉన్న రాగి బిల్లలను బంగారం అని నమ్మించి విక్రయిస్తున్నారు. బంగారం, సిల్వర్ కాయిన్స్‌పై రామలక్ష్మణ్ బొమ్మలు ఉన్న వాటిని ఎక్కువ ధరలకు అమ్ముతు డబ్బులు సంపాదించేవారు. ఈ క్రమంలో అన్వేశ్ గతంలో మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఎయిర్ పిస్తోల్, రెండు కత్తులు కొనుగోలు చేశాడు. జిల్లాల కోసం అమాయకులను బెదిరించి డబ్బులు సంపాదించేవారు. ఈ నెల 5న అన్వేశ్ స్వాతి ఇంటికి వెళ్లేందుకు అశోక్ వద్ద ఉన్న రివాల్వర్‌ను తీసుకెళ్లాడు. అక్కడ జితేందర్‌తో గొడవ జరగడంతో తుపాకుల విషయం వెలుగులోకి వచ్చింది. నెన్నెల పోలీస్ స్టేషన్‌లో కూడా అన్వేశ్‌పై ఇటీవల కేసు నమోదైంది.

ఇందిరమ్మ ఇళ్లు మొదట గిరిజనులకే


కొలాంగూడలో పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

- ఆదివాసీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- పాఠశాల భవనానికి శంకుస్థాపన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆదివాసీ గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ఈ క్రమంలో ఇందిరమ్మ పథకంలో భాగంగా మొదటగా కొలాంగూడ గిరిజనులకే అందిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ గిరిజన తాండాలో తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్ఈడబ్ల్యూఐడీసీ) ఆధ్వర్యంలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.38.15 లక్షలతో నిర్మించే పాఠశాల భవనానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ గిరిజనులకు మొట్టమొదటగా ఇందిరమ ఇళ్ల మంజూరు చేయడమే కాకుండా ఇళ్లపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయిస్తామన్నారు. తాండాలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయించి ఇంటింటికీ తాగునీటిని అందించి గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచుతామని హామీ ఇచ్చారు. వచ్చే వర్షాకాలంలోగా తాండాలోని సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి కోసం అడవికి వెళ్లి వెదురు బొంగులు తెచ్చుకునే కొలాంగూడ గిరిజనులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. గిరిజనులు సొసైటీ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం ద్వారా మొదటి విడతగా రూ.25 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పలువురు రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు రహదారి ఏర్పాటు చేయించాలని, ఎస్1 కాల్వ అవతల విద్యుత్ సౌకర్యం కలిపించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. రుణమాఫీపై పలువురు రైతులు కోరగా వెంటనే ఏవో కృష్ణకు ఫోన్ చేసి రైతుల రుణమాఫీ జరిగేలా చూడాలని సూచించారు. గ్రామ శివారులో ఉన్న 70 ఎకరాల ప్రభుత్వ భూమికి అటవీ అధికారులు ట్రెంచ్ కొట్టారని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వ భూమిగా తేలితే పేదలకు, నిర్వాసితులు పంపిణీ చేసేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో టీఎస్ఈడబ్ల్యూఐడీసీ డీఈ శ్రీనివాస్, ఏఈ రాజేశ్వర్‌రెడ్డి, ఎంఈవో పోచయ్య, మండల నోడల్ అధికారి హన్మాండ్లు, పంచాయతీ కార్యదర్శి రూపాదేవి, పీఏసీఎస్ చైర్మన్ కొట్టె సత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాసగౌడ్, మాజీ సర్పంచ్ పొట్టాల సుమలత, మాజీ ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, నాయకులు తోట రవి, చిట్ల సత్యనారాయణ, తూముల నరేశ్, పూదరి తిరుపతి, చింతపండు శ్రీనివాస్, సిరిపురం రాజేశ్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా ఇలా త్రిపాఠి


ఇలా త్రిపాఠి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా ఇలా త్రిపాఠిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత కలెక్టర్ కుమార్‌దీపక్ కొన్ని రోజులుగా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకోనున్నారు. గతంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేసిన ఇలా త్రిపాఠి ప్రస్తుతం తెలంగాణ టూరిజం డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మంచిర్యాల ఇన్‌చార్జి కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి..

మంచిర్యాలఅగ్రికల్చర్: విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే కంట్రోల్ రూమ్ నంబర్ 08736–250501కు సమాచారం ఇవ్వాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. మురుగు కాలవల్లో చెత్త చెదారం లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. దోమల నుంచి కాపాడుకునేందుకు శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని తెలిపారు.

బెల్లంపల్లిలో దొంగల హల్‌చల్

- ఒకేరాత్రి ఐదు షాపుల్లో చోరీ
- 4 కెమెరాలు, రూ.6 వేల నగదు అపహరణ


సీసీ కెమెరాలో నిక్షిప్తమైన వ్యక్తి


ఆనవాళ్లు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో దొంగలు రెచ్చిపోయారు. శనివారం రాత్రి ఐదు షాపుల్లో దొంగతనం చేసి కలకలం రేపారు. బెల్లంపల్లి నడిబొడ్డున బజారు ఏరియా ప్రాంతం ప్రధాన రహదారి పక్కనే ఉన్న షాపుల్లో చొరబడి కెమెరాలు, నగదును దోచుకెళ్లారు. పక్షం రోజుల క్రితం బజారు ఏరియా ప్రాంతంలో పార్కింగ్ చేసిఉన్న ఓ కారులో నుంచి రూ.28 లక్షలు పట్టపగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మరువకముందే ఐదు షాపుల్లో దొంగతనానికి పాల్పడటం సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. దొంగలు షాపులను లక్ష్యంగా చేసుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తిలక్ ఫొటో స్టూడియో తాళం పగుల గొట్టి 4 కెమెరాలు ఎత్తుకెళ్లారు. తర్వాత పక్కనే ఉన్న బాలాజీ ఎలక్ట్రికల్ షాపులో, ఆ పక్కనే ఉన్న పండిత్ మెడికల్ షాపులో చోరీ చేశారు. ఆయా షాపుల కౌంటర్ల నుంచి రూ.6 వేలు ఎత్తుకెళ్లారు. అదే వరుసలో ఉన్న మరో రెండు కిరాణా షాపుల్లోనూ ప్రవేశించి నగదు కోసం వెతికారు. నగదు దొరకకపోవడంతో ఉత్త చేతులతో వెళ్లిపోయారు. 4 కెమెరాలు, నగదుతో కలిసి రూ.91 వేల విలువైన సొత్తు పట్టుకెళ్లినట్లు పోలీసులు అంచనా వేశారు.

సీసీ కెమెరాల్లో చోరీ దృశ్యాలు

షాపుల్లో దొంగతనం చేసిన దృశ్యాలు ఆయా షాపుల్లో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. దొంగతనం చేయడానికి ఎంతమంది వచ్చారో తెలియదు కానీ షాపులోకి వెళ్లింది మాత్రం ఒకరే అని తెలుస్తోంది. చోరీలకు పాల్పంది స్థానికులా లేక బయటి ప్రాంతానికి చెందిన వ్యక్తులా అనేది తేలాల్సి ఉంది. రాత్రిపూట పోలీసు పెట్రోలింగ్ సరిగా లేకనే దొంగలు రెచ్చిపోయారని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. ఆదివారం ఉదయం షాపులు తెరవడానికి వెళ్లిన వ్యాపారులు తాళాలు పగులగొట్టి ఉండటం చూసి షాక్‌కు గురయ్యారు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య షాపులను పరిశీలించారు. రామగుండం నుంచి ప్రత్యేకంగా క్లూస్‌టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. యాజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

క్లూస్ దొరికాయి..

- రామగుండం సీపీ శ్రీనివాసులు


సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలిస్తున్న సీపీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజార్ ఏరియా ప్రాంతంలోని ఐదు షాపుల్లో చోరీకి పాల్పడిన నిందితుల క్లూస్ లభించాయని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని రామగుండం సీపీ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం రాత్రి బెల్లంపల్లికి వచ్చిన సీపీ చోరీ జరిగిన షాపులను సందర్శించారు. ఓ షాపులో సీసీ కెమెరాను పరిశీలించి షాపుల యజమానులతో మాట్లాడారు. ఓ సీసీ కెమెరాలో నిందితుల క్లూస్ దొరికాయని పేర్కొన్నారు. అనంతరం వినాయక మండపాల వద్దకు వెళ్లి గణనాథుడి నిదర్శించుకున్నారు. సీపీ వెంట బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

అనుమతులకు లోబడే కార్యక్రమాలు జరుపుకోవాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: ఇతరులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ అధికారుల అనుమతులకు లోబడి నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు సూచించారు. జిల్లా కేంద్రంలోని 100 ఫీట్ రోడ్‌లో గణేశ్ మండపంతోపాటు మరికొన్ని ప్రధాన కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను ఆదివారం రాత్రి సందర్శించారు. నిర్వహకులతో మాట్లాడారు. మండపాల వద్ద మద్యం సేవించకుండా చూడాలని, పోకిరీలను మండపాల వద్దకు రానివ్వొద్దని సూచించారు. మండపాల గొడవలు జరిగితే నిర్వాహకులే బాధ్యత వహించాలన్నారు. అనంతరం అధికారులకు బందోబస్తు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని పోలీసులకు సూచించారు. విధి నిర్వాహణలో అలసత్వం వహించొద్దని తెలిపారు. సీపీ వెంట డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సీలాల్ ఉన్నారు.

క్లుప్తంగా

పేకాడుతున్న ప్రముఖుల అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 10 మంది ప్రముఖులను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో అకస్మిక దాడి చేశారు. పేకాట ఆడుతున్న మంచిర్యాలకు చెందిన మిట్టపల్లి రామరావు, గోపాల్ శర్మ, చందూరి సుధాకర్, పార్థ రాజేందర్, బుద్ధార్తి శంకర్, నల్మాస్ జీవన్‌కుమార్, సునీల్‌కుమార్ బల్వ, బోనగిరి యాదగిరి, రామకృష్ణాపూర్‌కు చెందిన పులి శ్రీనివాస్, జైపూర్ మండలం ఇందారానికి చెందిన దాసరి రవిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.52,320 నగదు, 10 సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసులకు అప్పగించారు.

మేకల దొంగతనం కేసులో ముగ్గురి రిమాండ్

జైపూర్: మేకల దొంగతనం కేసులో ముగ్గురిని ఆదివారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గంగిపల్లిలో ఈనెల6న తుర్క సత్యనారాయణరెడ్డికి చెందిన షెడ్డులో 8 మేకలను శ్రీరాంపూర్ ఆర్కే–6 కాలనీకి చెందిన జిల్లాల శ్రీనివాస్‌గౌడ్, సుల్తాన్ సారయ్య, జగన్ల మల్లేశ్ దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుల నుంచి 8 మేకలతోపాటు కారు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

వర్షాలకు కూలిన ఇళ్లు



పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీపతిబాపురావు

జైపూర్: మండలంలోని టేకుమట్ల గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏడు ఇళ్లు కూలిపోయాయి. ఎంపీవో శ్రీపతిబాపురావు ఆదివారం పరిశీలించి బాధితుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రావణి తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ సర్వే



యంత్రంతో సర్వే చేస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు ఇచ్చోడ మీదుగా రైల్వేలైన్ సర్వే ప్రారంభమైంది. మండలంలోని జామిడి వద్ద యంత్రంతో ఆదివారం సిబ్బంది ఈ సర్వే నిర్వహించారు. వాగులు, కొండలు, గుట్టలు తొలగించడానికి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు.

భాషకు యాసే శ్వాస

తెలంగాణ 'యాస'నెపుడు
యీసడించు భాషీయుల
'సుహృద్భావన'ఎంతని
వర్ణించుట సిగ్గుచేటు..!
అని తెలంగాణ యాసను విమర్శించే వారికి కాళోజీ దీటుగా బదులిచ్చారు.



అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు
సంతృప్తి..
అన్యాయం అంతరిస్తే నా గొడవకు
ముక్తిప్రాప్తి..
అన్యాయాన్నెదిరించిన వాడే
నాకారాధ్యుడు..'
అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించారాయన.

- ప్రాంతీయ మాండలికమే ఆయువుపట్టు
- తెలంగాణ భాష పరిరక్షణకు కృషిచేస్తున్న జిల్లా కవులు
- నేడు తెలంగాణ భాషా దినోత్సవం

తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో రచయితగా కాళోజీ పేరు గడించారు. 'నా గొడవ'పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై ముక్కుసూటిగా స్పందించి..పాలకులపై అక్షరాయుధాలను సంధించారు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహాన్ని ఆయన గేయాలు కళ్లకు కడతాయి. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సెప్టెంబర్ 9న తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ నేపథ్యంలో కథనం.

నిర్మల్‌ఖిల్లా: తెలుగు భాష ఒక్కటైనా, మాండలికాలెన్నో..ఆంధ్రులు మాట్లాడే విధానానికి, తెలంగాణ ప్రజలు మాట్లాడే భాషకు మధ్య వ్యత్యాసం ఉంటుంది. తెలంగాణ యాస వినసొంపుగా ఉంటుంది. నిజాం పాలనలో ఉర్దూ ప్రాబల్యాన్ని తట్టుకుని మరీ తెలంగాణ ప్రాంతంలో తెలుగు నిలబడింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక ఉర్దూ కలగలిసిన తెలంగాణ ప్రజల యాసను కొందరు హేళన చేశారు. దీన్ని తెలంగాణ కవులు తీవ్రంగా ప్రతిఘటించారు. అలాంటి వారిలో కాళోజీ నారాయణరావు ఒకరు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన.. తెలుగు భాషపై, తెలంగాణ యాసపై ఎనలేని ప్రేమ కనబర్చారు. నిర్మల్ జిల్లాలో ప్రధానంగా మూడు రకాల మాండలికాలు కనిపిస్తాయి. జిల్లా కేంద్రం పరిసర ప్రాంతాలు, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లో స్థానిక భాషలో వైవిధ్యం కనిపిస్తుంది. వివిధ రకాల యాసలతోపాటు భాషా మండలికాలు వాడుకలో ఉన్నాయి. జిల్లాకు చెందిన కవులు కూడా తమ రచనల్లో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ తెలంగాణ భాష పరిరక్షణ కోసం తమవంతు పాత్ర పోషిస్తున్నారు.

మాండలికంతో భాషకు మనుగడ



తెలంగాణలో తెలుగు భాషకు యాస మాండలికం ప్రత్యేకం. స్థానిక శైలిలో మాట్లాడే భాషకు ప్రాధాన్యత ఉంది. తెలంగాణ యాసకు విభిన్న శైలితో ప్రత్యేకత సంతరించుకుంది. ఈ మాండలికాన్ని కాపాడుకుంటేనే తెలంగాణ భాషకు మనుగడ ఉంటుంది. మాట్లాడే విధానంలో తెలంగాణ సాహిత్యంలో భిన్నత్వం కనిపిస్తుంది.
– డాక్టర్ యు. కృష్ణంరాజు, కవి నిర్మల్

వ్యవహారికమే భాషకు ఆయువుపట్టు



తెలుగు భాషలో తెలంగాణ వ్యవహారికం వేరుగా ఉంటుంది. స్థానిక ప్రజలు మాట్లాడే వ్యవహారిక భాషనే ఆయువుపట్టుగా ఉంటుంది. తెలంగాణ యాసలో 'అవును..నేను ఆదిలాబాదోన్నే 'అనే కవిత సంకలనాన్ని స్థానిక వ్యాసాల్లో రచించాను. వందలాది మందితో మమేకమయ్యే సందర్భంలో భాషకు ఉన్న విభిన్న కోణాలు తెలుసుకోగలుగుతాం.
– డా.అప్పాల చక్రధారి, కవి, వైద్యనిపుణుడు

స్థానిక భాష ప్రాధాన్యత తెలపాలి



తెలంగాణ భాషను పరిరక్షించుకునేలా రాబోయే తరాలకు దాని ప్రాధాన్యతను స్థానిక వ్యవహారికాన్ని తెలియజెప్పాల్సిన అవసరం ఉంది. కవులు, కళాకారులు, భాషోపాధ్యాయులు తెలంగాణ యాస, భాషను అందులోని పద పరిమళాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలి. తెలంగాణ యాస, భాష ప్రతిబింబించే రచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి. – తుమ్మల దేవరావు, కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

దళితులపై రాళ్లదాడి



దళితుల ఇంట్లో విసిరిన రాళ్లు



వివరాలు సేకరిస్తున్న భైంసా ఏఎస్పీ

- ఝరి(బి)లో గణేశ్ ప్రతిష్ఠిస్తుండగా ఘటన
- అదే సమయంలో ఓ ఇంట్లో చిన్నారి బర్త్ డే
- గణేశ్ మండపం వైపు రాళ్లు విసిరిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఇరువర్గాల మధ్య ఘరణ
- గ్రామాన్ని సందర్శించిన భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



తానూరు పోలీస్ స్టేషన్ ఎదుట గాయపడిన దళిత మహిళలు

తానూరు: మండలంలోని ఝరి(బి) గ్రామంలో శనివారం రాత్రి గణేశ్ ప్రతిష్ఠాపన జరుగుతోంది. అక్కడే దళితవాడలో ఓ ఇంట్లో చిన్నారి పుట్టిన వేడుకలు నిర్వహిస్తున్నారు. గణేశ్ ప్రతిష్ఠాన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మండపం వైపు రాళ్లు విసిరారు. గణేశ్ మండలి సభ్యులు దళితవాడకు చేరుకుని మీరే రాళ్లు విసిరారని అనడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దళితులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఇరువురు రాళ్లదాడితో గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. గణేశ్ మండలి సభ్యులు బర్త్ డే జరుగుతున్న ఇంటికి వెళ్లి రాళ్లదాడి చేశారు. ఇందులో పద్మబాయి, పూజ, సంఘమిత్ర, గౌతమి, రాధికలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సీఐ మల్లేశ్ గ్రామాన్ని సందర్శించారు. ఇరువర్గాల వారిని సముదాయించి వివరాలు సేకరించారు. రాళ్లదాడిలో గాయాలైనవారిని చికిత్స నిమిత్తం భైంసాలోని ప్రభుత్వ తరలించారు. ఇరువురు ఫిర్యాదులతో ఆదివారం 13 మంది దళిత యువకులపై కేసు, 11 మంది గణేశ్ మండలి యువకులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

మృగాడికి ఉరిశిక్ష పడేంత వరకు ఉద్యమిస్తాం

- ఉమ్మడి జిల్లా తొమ్మిది తెగల ఆదివాసీలు స్పష్టం



నినాదాలు చేస్తున్న ఆదివాసీ పెద్దలు, రాయిసెంటర్ సార్‌మెడీలు


నార్నూర్: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అత్యాచారానికి పాల్పడిన షేక్ ముక్దుంను ఫాస్ట్‌కోర్టు ద్వారా విచారణ జరిపించాలని, ఆ మృగాడికి ఉరిశిక్ష పడేంత వరకు ఉద్యమిస్తామని ఆదివాసీలు స్పష్టం చేశారు. మండలంలోని మాన్కాపూర్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన తొమ్మిది తెగల ఆదివాసీలు, రాయిసెంటర్ సార్ మెడీలు జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, రాయి సెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు మాట్లాడుతూ 1970లో వలసవచ్చిన మైనార్టీలకు సంబంధించి భూయాజమాన్య హక్కుపత్రాలు, ఆధార్, రేషన్, కరెంట్ బిల్లులు వెంటనే రద్దుచేసి ఏజెన్సీ నుంచి వారిని ప్రభుత్వమే తరలించాలన్నారు. అలాగే మైనార్టీలకు వత్తాసు పలికే అధికారులను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల చివరివరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే 'మా ఊరిలో మా రాజ్యం'ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆదివాసీలపై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఇందులో తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ భూర్స పోచయ్య, కొడప నగేశ్, గేడం గణేశ్, కొట్నాక్ విజయ్, బాపూరావు, విజయ్, ప్రభాకర్, పెందూర్ పుష్పరాణి, ఖమ్ము, మనోజ్, సార్‌మెడీలు భీంరావ్, దౌలత్‌రావు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దొంగలుగా అనుమానించి దాడి..



61వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రాంపూర్ గ్రామస్తులు

- రాంపూర్‌లో రాత్రి ఆగిన వాహనం
- దాడి చేసిన గస్తీకాసిన ఇద్దరు గ్రామస్తులపై కేసు
- వారి అరెస్టుతో పలువురు రాస్తారోకో



మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల వరుసగా పశువులు, మేకలు, గొర్రెలను ఎత్తుకెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు గ్రామంలో రాత్రి గస్తీ కాస్తున్నారు. ఆదివారం వేకువ జామున ఓ వాహనం ఆగింది. అందులో ఉన్న వారిని దొంగలుగా భావించి గస్తీ కాస్తున్న గంగాధర్, ఎల్లయ్య దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేయడంతో రాంపూర్‌వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నర్సాపూర్(జి)పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి మాట్లాడారు. తెల్లవారు జామున 2.50 గంటల ప్రాంతంలో భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం రాంపూర్ వద్ద మొరాయించింది. గస్తీ తిరుగుతున్న ఇద్దరు గ్రామస్తులు.. డ్రైవర్ ఒబేద్, షేక్ రఫీలను విచారించారు. భైంసా వాసులమని, కూరగాయల వ్యాపారం చేస్తుంటామని తెలిపారు. వారిని దొంగలుగా భావించి చితకబాదారు. దాడిచేసిన గంగాధర్, ఎల్లయ్యలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

గ్రామస్తుల రాస్తారోకో

గంగాధర్, ఎల్లయ్యను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నర్సాపూర్ (జి) పోలీస్‌స్టేషన్ 61వ జాతీయ రహదారిపై గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. సుమారు రెండు గంటల పాటు రాస్తారోకోతో కి.మీ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భైంసా సీఐ నైలు, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్, దిలావర్‌పూర్ ఎస్సై రాజేశ్వర్‌గౌడ్, కుంటాల ఎస్సై భాస్కరాచారి గ్రామస్తులను సముదాయించడంతో రాస్తారోకోను విరమించారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం డిమాండ్ చేశారు. శనివారం ఆయన నస్పూర్ షిర్కేకాలనీలోని సివిల్ కార్యాలయంలో గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులు వేతనాలు పెరగక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కంపెనీ లాభాల నుంచి వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు మేకల రామన్న, యాదగిరి, రాజేందర్, తిరుపతి, రాజయ్య, సంపత్ పాల్గొన్నారు.

కాల్వలో పడి పశువుల కాపరి మృతి



రామ్‌సింగ్ (ఫైల్)

జన్నారం: మండలంలోని దేవునిగూడకు చెందిన పశువుల కాపరి అజ్మీరా రామ్ సింగ్ ప్రమాదవశాత్తు కడెం ప్రధాన కాల్వలో పడి మృతి చెందాడు. ఎస్సై ధానాజీ కథనం ప్రకారం..రామ్‌సింగ్ (58) శనివారం గేదెలను మేపేందుకు గ్రామ సమీపంలోని కడెం ప్రధాన కాల్వవైపు వెళ్లాడు. ఈ సమయంలో ఆయన ప్రమాదవశాత్తు కాలువలో పడ్డాడు. అతడి కోసం గాలించగా, 15వ గేట్ పిల్లకాల్వలో మృతదేహం లభించింది. మృతుడి కుమారుడు దేవ్‌సింగ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



ప్రభు (ఫైల్)

తాంసి: పాముకాటుకు గురైన యువకుడు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..భీంపూర్ మండలం పిప్పల్‌కోటికి చెందిన పెద్దింటి భూమన్న–పొచ్చుబాయి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, కుమార్తెకు వివాహమైంది. కుమారుడు ప్రభు(25) కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడునెలల క్రితం తండ్రి భూమన్నకు కాలు విరిగింది. ప్రభు..డ్రైవర్‌గా పని మానేసి వ్యవసాయ పనులు చేస్తున్నాడు. గురువారం పంట చేల్లో పనిచేస్తుండగా అతని కాలిపై పాము కాటేసింది. స్థానికులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. అందరితో కలివిడిగా ఉండే ప్రభు మృతితో పిప్పల్‌కోటిలో పండగపూట విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో యువకుడు బలి



వినయ్‌కృష్ణ (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి.. అన్నీ పోగొట్టుకుని, చివరకు అప్పులపాలైన యువకుడు ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తిరుమలగిరి కాలనికి చెందిన మూగల రమేశ్–వనిత దంపతుల కుమారుడు వినయ్‌కృష్ణ(22) తన మేనమామకు చెందిన ఫొటో స్టుడియోలో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. ఆర్థికంగా అప్పుల పాలయ్యాడు. అప్పులు కూడా చేశాడు. దీంతో కొంత కాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. శనివారం సాయంత్రం ఫొటో స్టుడియోలోనే ఫ్యానుకు ఉరేసుకున్నాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో స్టూడియోకు వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. వినయ్ తల్లి వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో 45 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారని సమాచారం అందింది. వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి కుడి చేతిపై సంగీత, ఎడమ చేయిపై ఎస్‌వైఎస్ అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్టుతో రాసి ఉంది. ఛాతీపై ఒక పుట్టుమచ్చ ఉందని, బ్లూ, పసుపు రంగు చెక్స్‌షర్ట్, బ్లూ రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యూరీ గదిలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే సెల్ 97011 12343 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నెల రోజుల్లో కాంట్రాక్ట్ కార్మికుల వేతన కమిటీ

- ఐఎన్టీయూసీ అధ్యక్షుడు జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంస్థల్లో పని చేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు నెల రోజుల్లో వేతనాల పెంపు కోసం వేజ్‌బోర్డు కమిటీని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షుడు బి.జనక్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం నస్పూర్ -శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 ఏళ్లుగా వేతనాలు పెరుగక కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. దీని కోసం నేడు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈనెల 11న హైదరాబాద్‌లో ఐఎల్ఓ డైరెక్టర్ హైదరాబాద్ వేతనాల పెంపులపై చర్చలు ఉంటాయని తెలిపారు. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి రెండేళ్లే అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో వచ్చే నాలుగైదేళ్లలో గనులు మూతపడే ప్రమాదం ఉన్నందున శ్రావణ్‌పల్లి ఇతర గనులను తెరస్తామన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో త్వరలో రెండు విద్యుత్‌ప్లాంట్లు ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. కార్మికులకు గత ఆర్థిక సంవత్సరం కంపెనీ సాధించిన లాభాల నుంచి వాటా కోసం ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. కార్మికుల పెర్క్స్‌పై ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్, సొంతింటి పథకం, సీపీఆర్‌ఎంఎస్‌లో మార్పుల కోసం కృషి చేస్తున్నామన్నారు. అదేవిధంగా నస్పూర్ కాలనీలోని సీ81లో ఐఎన్టీయూసీ నూతన కార్యాలయాన్ని జనక్‌ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు ధర్మపురి, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, తిరుపతిరాజు, నాయకులు తిరుపతిరెడ్డి, భీం రవి, రాకేశ్‌రెడ్డి, పిన్నింటి మల్లారెడ్డి, ల్యాగల శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, మెండె వెంకన్న చందు మోహన్ పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి'

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు కోరారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బాలరాజు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. గడిచిన పదేళ్లలో కార్పొరేట్‌లకు అనుకూలంగా పాలన సాగిందని తెలిపా రు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు అప్పగించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఆర్టీసీ కార్మికులకు పెండింగ్ పీఆర్సీ బకాయిలు ఇవ్వాలని కోరారు. హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా 510 జీవో పరిధిలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కౌన్సిల్ సభ్యులు మిట్టపల్లి పౌలు, జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు ఖలీందర్ అలీఖాన్, నాయకులు తోకల సరస్వతి, దాగం మల్లేశ్, కె.వీరభద్రయ్య, కొట్టె కిషన్‌రావు, సత్యనారాయణ, బాపు, రాజన్న, రాజమల్లు, సత్తయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

నిండుకుండలా ఎల్లంపల్లి

- మళ్లీ గేట్లు తెరిచిన అధికారులు



భారీ నీటితో ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగడంతో నిండుకుండలా మారింది. గతవారం 32 గేట్లు తెరిచి గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. తాజాగా వరద ఉధృతి పెరిగింది. దీంతో జలాశయానికి రెండు రోజుల్లో 4 టీఎంసీల నీరు చేరింది. ప్రాజెక్టు నీటిమట్టం 20 టీఎంసీలకు చేరడంతో మళ్లీ గేట్ల ఎత్తారు. కడెం ప్రాజెక్టుతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి కూడా భారీగా వరద వస్తోంది. ఆదివారం ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు గాను 147.70 మీటర్లు ఉంది. మొత్తం 20.175 టీఎంసీలకు 19.160 టీఎంసీల నిల్వ ఉంది. ఎగువ నుంచి 63 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కడెం ప్రాజెక్టు నుంచి మరో 20 వేల క్యూసెక్కులు కలిపి మొత్తంగా 83 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. ఔట్‌ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 299 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా ప్రాజెక్టు 12 గేట్లను తెరిచి 96 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.